ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జయశంకర్
భూపాలపల్లి
3
ములుగు
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024





ప్రతీ జాతరలోనూ ఇలాంటి సమస్యలే..

# కాలుష్య రహిత జాతర కలేనా?





వరంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కాలుష్యం పడగ విప్పుతోంది. లక్షలాది మంది భక్తులు వచ్చే మహాజాతరలో వాహన కాలుష్యంతో పాటు దుమ్ము, కట్టెల పొయ్యి పొగ భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. సాధారణంగా పీల్చుకునే గాలి కంటే జాతర సమయంలో 3నుంచి 5రెట్లు గాలి కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. 2020, 2022లో మేడారం జాతరలో గాలితోపాటు జంపన్నవాగు నీటిపై కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ బృందం పరిశోధనలు చేస్తోంది. జంపన్నవాగులో నీరు ప్రవాహం ఉండటంతో పెద్దగా కలుషితం కావటం లేదు. కానీ, గాలిలో మాత్రం కాలుష్యం వీపరితంగా పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, అస్తమా రోగులకు ప్రమాదకరంగా మారనుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం పెరగకుండా ముందు జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టిసారిస్తేనే భక్తుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

### కాలుష్యం కట్టడికి కానరాని చర్యలు

మేడారం మహాజాతరకు ఏటా కోటిన్నర మంది భక్తులు వస్తారని ప్రభుత్వం ప్రకటిస్తుంది. అలాగే ఐదారు రాష్ట్రాల నుంచి భక్తులు 8లక్షలకు పైగా ప్రవేటు వాహనాలను మేడారం తీసుకవస్తున్నారు. వీటితో పాటు ఈ ఏడాది ఆరువేల ఆర్టీసీ బస్సులు జాతరకు రానున్నాయి. ద్విచక్ర వాహనాలు వేలల్లో జాతర దారిపట్టనున్నాయి. జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం జాతరను ముంచెత్తుతుంది. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేచి గాలిలో కలిసిపోతుంది. ఇదే గాలిని ప్రాణవాయువుగా పీల్చుకుని భక్తులు లేనిపోని రోగాలను తెచ్చుకుంటున్నారు. మేడారం జాతర ప్రాంగణం నుంచి నార్లాపూర్, చింతల్, హెలీప్యాడ్ ప్రాంతం, కన్నెపల్లి, ఊరట్టం, జంపన్నవాగు, తాడ్వాయి వెళ్లే దారి, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల పార్కింగులతో భారీగా దుమ్మలేస్తుంటుంది. అలాగే జాతరకు వచ్చే భక్తులు కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటారు. ఈ కట్టెల పొయ్యితో వచ్చే పొగ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ముంచెత్తుతున్న కాలుష్యం

మేడారం జాతరలో కాలుష్యం సాధారణంగా ఉండే దానికంటే అధికంగా మూడు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సాధారణం గా నేషనల్ యాం బి యంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్‌ఏ ఏక్యూఎస్) ప్రకారం 10 పీఎం (10 మైక్రో మీటర్ల కంటే తక్కువ ఏరోడైనమిక్ వ్యాసం కలిగిన పర్టిక్యులేట్ మ్యాటర్) కంటే 3 నుంచి 5 రెట్లు ఎక్కువ గా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. 2020 మహాజాతర సందర్భంగా గాలి కాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. జాతరకు వారం ముందు, జాతర జరిగే నాలుగు రోజులు, జాతర ముగిసిన వారం రోజులకు ఈ శాంపిల్స్ సేకరించారు. గత జాతరలో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) 50పీఎంలోపు ఉంటే లోపు ఎలాం టి ప్రమాదం ఉండదు. కానీ, 51 నుంచి 400ఏక్యూఐ ఉంటే సున్నితమైన వ్యక్తులు, చిన్న పిల్లలకు శ్వాస ఇబ్బందులు ఎదురవుతాయని, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడుతారని, దీర్ఘకాలం శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 401కంటే ఎక్కువ ఏక్యూఐ ఉంటే ఆరోగ్యవంతులు కూడా అనారోగ్యం పడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కాలుష్య నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. 2020 జాతరలో గాలి నాణ్యత సూచిక 327 పీఎం నుంచి 408 వరకు నమోదైంది. సాధారణంగా కంటే 3 నుంచి 5రెట్లు అధికంగా గాలి కలుషితమైనట్లుగా అధికారులు గుర్తించారు. 2022 జాతరలో గాలి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శాంపిల్స్ తీయలేదని సమాచారం. ప్రస్తుతం మళ్లీ జాతరకు సంబంధించి శుక్రవారం నుంచి గాలి కాలుష్యంపై పరీక్షలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమైంది. ప్రస్తుతం వాహనాల సంఖ్య భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో ఈసారి మరింత గాలి కాలుష్యం పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా పర్యావణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- వాహనాల రద్దీ, జాతరలో వెలిగించే కట్టెల పొయ్యిలే ప్రధాన కారణం
- సాధారణ గాలికంటే 3 నుంచి 5 రెట్లు అధికంగా పొల్యూషన్
- చిన్నపిల్లలు, అస్థమా, గుండె వ్యాధి బాధితులకు తీవ్ర ఇబ్బందులు
- గ్యాస్, కమ్యూనిటీ కిచెన్లను ప్రోత్సహించాలని నిపుణుల సూచన

**పొగ, దుమ్ముతో మేడారంలో గాలి కలుషితం**

### ప్రభుత్వం దృష్టి పెడితేనే..

ప్రభుత్వం మహాజాతరలో ప్లాస్టిక్‌పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ప్రతీ జాతరకు ఫ్రీప్లాస్టిక్ జాతర అంటూ ప్రచారం చేయడం.. జాతర ప్రారంభం కాగానే పట్టించుకునే వారు ఉండరు. అయితే అత్యంత ప్రమాదకరమైన గాలి కాలుష్యంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా వాహనాల రాకపోకల నేపథ్యంలో దుమ్ము లేవకుండా నిత్యం నీటిని రోడ్లపై చల్లుతూ ఉండాలని, అలాగే మురికి రోడ్లపై కంకర వేయటం, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఎక్కువ పొగను వెదజల్లే వాహనాలను జాతరకు రాకుండా కట్టడి చేయాలని, కట్టెల పొయ్యిపై వంటలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాస్‌ను వినియోగించేలా చూడాలని, అడవులను నరికివేయకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే జాతర గద్దెలకు దూరంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఆ పార్కింగ్ స్థలాలు కూడా విశాలంగా ఉండటంతో పాటు అందులో తారురోడ్లు లేదా సీసీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని, దీంతో దుమ్ము లేచే అవకాశాలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

గద్దెల సమీపంలోని హోటళ్లలో కట్టెల పొయ్యిల వాడకంపై నిషేధం విధించాలని, కిరోసిన్‌తో కూడా వంటల తయారీని నియంత్రించేటువంటి చర్యలతో కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కమ్యూనిటీ కిచెన్‌లను ప్రోత్సహించటంతో కూడా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడితేనే మహాజాతరలో కాలుష్యాన్ని తగ్గించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడినట్లు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి భక్తులకు తెలియకుండానే మేడారం మహాజాతరలో కాలుష్యం విషపూరితమై మానవ జీవనంపై ప్రభావం చూపిస్తుందని, కాలుష్యాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి**

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వివరాలు 4లో..



భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

# జనం.. వనం బాట..

**లక్షలాదిగా మేడారం తరలొస్తున్న భక్తులు**

మహా జాతరకు సమయం సమీపిస్తోంది. బుధవారం జరిగిన మండమెలిగే పండుగతో జాతర సందడి రెట్టింపయ్యింది. ఇప్పటికే నెలరోజులుగా ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు సమ్మక్క సారలమ్మ గద్దెల చెంతకు తరలొస్తుండగా.. ఆ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటివరకు 30లక్షలమంది అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని, గురువారం లక్షమందికి పైగా వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. జనం వనం బాట పడుతుండటంతో మేడారం ప్రాంతం సందడిగా మారుతోంది. ఓ వైపు భక్తులు ఏర్పాటు చేసుకుంటున్న తాత్కాలిక గుడారాలు, చిరు వ్యాపారుల అంగళ్లతో కళకళలాడుతోంది. మరోవైపు 21వతేదీ నుంచి నాలుగురోజులపాటు సాగే ఈ గిరిజన కుంభమేళాకు కోటి మందికిపైగా వస్తారని అంచనా వేస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

- 15 మందితో ప్రమాణ స్వీకారం
- హాజరైన మంత్రి సీతక్క



సీతక్కతో ప్రమాణ స్వీకారం చేసిన మహాజాతర ఉత్సవ నూతన కమిటీ

మేడారం, ఫిబ్రవరి 15 : మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మేడారంలో గురువారం అట్టహాసంగా జరిగింది. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీని నియమించింది. ఈనెల 12 నుంచి 25వరకు దీని కాలపరిమితిని నిర్ణయించింది. కమిటీ చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్లుగా 13 మందితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రధాన పూజారి జగ్గారావును నియమించారు. మొత్తం 15మందితో జాతర ఉత్సవ కమిటీ కొలువుదీరింది. మంత్రి సీతక్క సమక్షంలో దేవాదాయశాఖ మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఈ కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు సకల సౌకర్యాలు రూపకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కోటి 50లక్షలకు పైగా భక్తజనం మహాజాతరకు తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలను

మిగతా 4వ పేజీలో..

# వనదేవతలకు చంద వంశీయుల మొదటి మొక్కులు



చీర, సారెతో వనదేవతల గద్దెలకు చేరుకుంటున్న చంద వంశీయులు

తాడ్వాయి, ఫిబ్రవరి 15: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మలకు చంద వంశీయులు గురువారం మొదటి మొక్కులు చెల్లించి మహాజాతర ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సమ్మక్క దేవతను చంద వంశీయులు ఆడబిడ్డగా భావిస్తూ ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం మొదటి మొక్కులు చంద వంశీయులే చెల్లించడం ఆనవాయితీ.

**సమ్మక్కతల్లికి పుట్టింటి పట్టుచీర..**

**భక్తిపారవశ్యంతో ఉప్పొంగిన బయ్యక్కపేట**

గురువారం ఉదయం చంద వంశీయులు ప్రధాన పూజారి చంద బాబూరావు, పరమయ్య దంపతుల ఆధ్వర్యంలో డోలువాయిద్యాల నడుమ బయ్యక్కపేట గ్రామం నుంచి మేడారానికి ఊరేగింపుగా బయలుదేరారు. మధ్యాహ్నం వారికి మేడారం దేవాదాయశాఖ అధికారులు డోలువాయిద్యాలతో ఘన స్వాగతం పలుకగా సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని పసుపు, కుంకుమ, బంగారం(బెల్లం), చీర, సారె, పూలు, పండ్లు, కుడుకలు, పోకలు సర్పించుకున్నారు. ఇందులో ఒడిబాల బియ్యం ప్రత్యేకత కలదు. చంద పరమయ్య ఇంట్లో వెలసిన సమ్మక్క దేవతకు కుటుంబసభ్యులు సంప్రదాయరీతిలో ఒడిబాల బియ్యం దేవతలకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు,పగిడిద్దరాజుల గద్దెలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలోని చంద వంశీయులు భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయారు. అమ్మవార్లకు చెల్లించాల్సిన పూజా కార్యక్రమాలు నిర్వహించి సంప్రదాయాలతో మొక్కులు చెల్లించారు. ఈఏడాది పిల్లాపాపలు, పాడిపంటలు బాగుండాలని, ప్రస్తుతం జరుగబోయే మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు వనదేవతలను వే డుకున్నారు. ఈకార్యక్రమంలో చంద పరమయ్య-లక్ష్మి దంపతులతోపాటు పూజారుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద గోపాలరావు, స్వామి, కళ్యాణ్, రఘుపతిరావు, వెంకటేశ్వర్లు, కిషన్‌రావు, అన్నవరం వెంకన్న, నవీన్, గణేష్, కృష్ణ, మడప మధు, సృజన్, దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు, యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వనదేవతలను దర్శించుకుని పసుపు,కుంకుమ, బంగారం సమర్పించుకుంటున్న చంద వంశీయులు

# ప్రాజెక్టు ఉన్నా నిష్ప్రయోజనమే..

**భూపాలపల్లికి చుక్కనీరు అందడం లేదు..**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే సత్యనారాయణ తొలి ప్రసంగం**

**ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15: జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన తన తొలి ప్రసంగం చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా భూపాలపల్లి జిల్లాకు సాగునీరు గానీ, తాగునీరు గానీ ఇప్పటి వరకు ఏమాత్రం అందలేదన్నారు. మెడికల్ కాలేజీని ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించారని, దీనికి అనుమతులు రాలేదని అన్నారు. 100 మంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం, లైబ్రరీ లేదని అన్నారు. ప్లేగ్రౌండ్, భవనం కూడా పూర్తి కాలేదని తెలిపారు. వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సింగరేణి నిధుల ద్వారా మెడికల్ కాలేజీకి బస్సు సౌకర్యం, హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. ఆస్పత్రిలో వైద్య నిపుణులు లేరని, ప్లేట్ మిషన్, సింగల్ డోనర్ మిషన్, ఎమ్మారై, సీటీ స్కాన్ తదితర యంత్రాలు లేవని అన్నారు. డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులు వెచ్చించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. యురాలజీ, నెఫ్రాలజీ, గైనిక్, ఆర్థో వైద్య నిపుణులను నియమిం చాల న్నారు. డీబీఎం 38, 18 కాల్వల ద్వారా నీరు రావడం లేదని తెలిపారు. జూలై లో 63 సెంటీమీటర్ల వర్షం పడిందని, దీంతో భారీ వరద సంభవించి 124 చెరువులు తెగిపోయాయని, ఆరుగురు మనుషులు, 1100 మూగజీవులు మృత్యువాతపడ్డాయని తెలిపారు. 11వేల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని తెలిపారు. ఈ క్రమంలో గత ంలో గత ప్రభుత్వం కేవలం 70 చెరువులకు మాత్రమే మరమ్మతులు చేపట్టిందని, మిగతా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నీట మునిగిన 2 వేల ఇళ్లకు నష్టపరిహారం చెల్లిం చాలని కోరారు. మృతి చెందిన ఆరుగురు కుటుంబాలను అన్ని విధాలా ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోరంచపల్లి చిరు వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని అన్నారు. మోరంచపల్లి గ్రామస్థులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం న్యాయం చేకూరలేదని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించి వెళ్లారు గానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు.

# త్వరలో ములుగు వైద్య కళాశాల తరగతులు

- ప్రిన్సిపాల్ నియామకం పూర్తయింది
- మేడారం జాతరలో విస్తృతంగా వైద్య సేవలు
- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ కుమార్



ములుగు ఏరియా వైద్యశాలలో సమీక్ష జరుపుతున్న వైద్యశాఖ అధికారులు

ములుగు, ఫిబ్రవరి 15: ములుగుకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలలో త్వరలోనే అడ్మిషన్ ప్రక్రియ, తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రిన్సిపాల్ నియామకం కూడా పూర్తయ్యిందని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయకుమార్ అన్నారు. గురువారం ఆయన నేతృత్వంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డాక్టర్ శివరామకృష్ణ, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీహెచ్ఎస్ జగదీశ్వర్, ఏటూరునాగారం సామాజిక వైద్యశాల సూపరింటెండెంట్ సురేష్ బృందం మేడారంలో పర్యటించింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన 50 పడకల వైద్యశాలతో పాటు మెడికల్ క్యాంపులను పరిశీలించారు. అనంతరం ములుగులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో సమావేశమై సమీక్షించారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, అత్యవసర సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. 50 పడకల ఆస్పత్రిలో సేవలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. మహిళలకు, గుండె సంబంధ సమస్యలున్న వారికి కూడా తక్షణమే మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. అంబులెన్స్‌లు, వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తున్నామని తెలిపారు. ములుగు మెడికల్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి జాతీయ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. మౌలిక సౌకర్యాల కల్పన కోసం గత ప్రభుత్వానికి, ప్రస్తుత నూతన ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ప్రస్తుతం ములుగు ఏరియా ఆస్పత్రిలో 140 పడకలు అందుబాటులో ఉన్నాయని, మెడికల్ కళాశాలకు 220 బెడ్లు అవసరం పడుతాయని తెలిపారు. తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు భవనాలను సమకూర్చుకోవాల్సి ఉందని, ఈవిషయమై జిల్లా అధికారులతో చర్చించామని తెలిపారు.

# ఉపాధ్యాయ సంఘం నేతల నిరసన

**కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపాటు**



అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15: ఉపాధ్యాయులు నిరసనకు దిగాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శిస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు చావ రవి, రమణారెడ్డి, రఘుపతి రెడ్డి, రమేష్, బానోత్ సేవానాయక్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూలీలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి**

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

వివరాలు 6వ పేజీలో


జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు







# బారులు తీరిన భక్తులు.. రద్దీగా మారిన గద్దెలు

**● మేడారంలో కొనసాగిన దర్శనాలు ● లక్షకు పైగా తరలివచ్చిన భక్తజనం**

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మలను భక్తులు గురువారం భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. వనదేవతల గద్దెలను నేరుగా దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల వద్ద తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం), పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె సమర్పించారు. కొబ్బరికాయలను కొట్టి యాట మొక్కులను చెల్లించుకున్నారు. తమ కోరికలను తీర్చాలని వనదేతలను వేడుకున్నారు. మేడారం పరిసరాల్లోని వనతి షెడ్లలో, అటవీ ప్రాంతాల్లోని చెట్లకింద వంటలు చేసుకొని ఆనందంగా గడిపారు. భక్తులు గురువారం లక్షకు పైగా దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

**ఇప్పటి వరకు 30 లక్షల మంది**

మహాజాతర నేపథ్యంలో మేడారంలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు సుమారు 30 లక్షల మంది వనదేతలను దర్శించుకుని ఉంటారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మహాజాతరకు సుమారు రెండు నెలల ముందుగానే భక్తులు మేడారం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





బంగారంతో వెళుతున్న మహిళలు

## కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ

(3వ పేజీ తరువాయి)

దర్శించుకుంటారని అన్నారు. ఇప్పటికే 30లక్షలకు పైగా మంది భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. ములుగు జిల్లా కోసం పోరాడిన ముంజాల భిక్షపతితో పాటుగా జాతర అభివృద్ధికి పాటుపడిన వారికే ఉత్సవ కమిటీలో స్థానం దక్కిందన్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలను కోరారు.

**ప్రమాణ స్వీకారం చేసిన వారు వీరే..**

చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అబ్బయ్య, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయి జగ్గారావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.





## ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించాలి

**పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 15 : మేడారం మహాజాతరను ప్లాస్టిక్ ఫ్రీగా నిర్వహించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. మేడారంలో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా వనదేవతలను దర్శించుకొని చీరె, సారె సమర్పించారు. పారిశుధ్య నిర్వహణపై మేడారంలోని హరిత హోటల్ సమావేశ గదిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలని అన్నారు. జాతరలో, జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్ మాట్లాడుతూ.. జాతరలో నిర్వర్తించే అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని అన్నారు. జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది, యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే అధికారులు తప్పనిసారిగా ఈనెల 19న సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని అన్నారు. మహాజాతరలో పారిశుధ్య పనులు చేయడానికి 10సెక్టార్లు 60సబ్ సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీపీవో, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల జరుగుతాయని అన్నారు. ఫీల్డ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రతి జోన్‌కు ఎంపీవో స్థాయి అధికారిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, వివిధ జోన్ అధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన వైద్య సేవలు

**హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్**


మేడారంలోని ప్రధాన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

మేడారం, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ డైరక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ శివప్రాసద్‌తో కలిసి జాతర పరిసరాల్లోని వైద్య శిబిరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు అందిస్తున్న సేవల గురించి డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ప్రధాన తాత్కాలిక ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడుతూ మహాజాతర సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యసేవలు అదించాలన్నారు. సరిపడా మందులను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట డీసీహెచ్ జగదీశ్వర్, ఏటూరునాగారం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రేమ్‌సింగ్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

**ఆరోగ్య కార్యక్రమాలపై నేడు సమీక్ష**

హనుమకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్ ఐఎంఏ హాలులో జరిగే ఈ సమీక్షా సమావేశానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొననున్నారు. జాతీయ కార్యక్రమాల అమలును సమీక్షించనున్నారు. డీహెచ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రవీంద్రనాయక్ నగరంలో సమీక్షలో పాల్గొంటున్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఆహార నాణ్యత అధికారుల తనిఖీలు

మేడారం, ఫిబ్రవరి 15: మహాజాతర నేపథ్యంలో ఆహార నాణ్యత అధికారులు మేడారంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. వందల సంఖ్యలో వెలిసిన దుకాణాల్లోని ఆహార పదార్థాలను, తినుబండారాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం భక్తులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత శ్రీ, బాపుజీ, కృష్ణమూర్తి, రోహిత్‌రెడ్డి, వాసూరాం, ఎస్.అనూష, ఆర్.అనూష, ప్రత్యూష మేడారం జాతరలో విడివిడిగా తనిఖీలు చేశారు. రకరకాల రంగులు కలిపిన పదార్థాలను పరిశీలించారు. బాగా మరిగిన నూనెలు సమారు 15 లీటర్ల వరకు పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

**భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా**

కాటారం, ఫిబ్రవరి 15: ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాలని భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదే శించారు. కాటారం మండలంలో ఆయన గురువారం పర్యటించారు. మండలకేంద్రంలోని తిమ్మన్నకుంటలో చేపట్టనున్న క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. క్రీడా ప్రాంగణానికి రూ.30 లక్షలు మంజూ రైందన్నారు. రూ.10లక్షలతో చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేసి మిగతా నిధు లతో క్రీడా వేదిక నిర్మాణం చేపట్టా లన్నారు. మైదానంలో వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌తో పాటు వివిధ క్రీడల కోసం మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎర్రచెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతోందని పలువురు యువకులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా దానిని ఆయన పరిశీలించారు. ఎర్రచెరువు విస్తీ ర్ణాన్ని సర్వే చేయించాలని అధికారులను ఆదేశించారు. చెరువు కింద పంటల సాగు లేకుంటే శిఖం భూమిని పరిరక్షించి ఇరిగేషన్‌శాఖ ద్వారా నోఆబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం వినియోగిం చాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించారు. ఖాళీ ప్రదేశంలో పూలు, పండ్ల మొక్కలను నాటి గార్డెనింగ్‌తో సుందరీకరణ చేయడా నికి ప్రతిపాదనలు పంపాలన్నారు. మేడిపల్లి సమీపం లో ఖాళీగా ఉన్న అటవీస్థలాన్ని పరిశీలించి న్యాక్ భవన నిర్మాణం కోసం వినియోగించాలన్నారు. అనంతరం కాటారం జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పలు సబ్జెక్టుల పాఠాలు బోధించారు. పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిం చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో అడ్డూరి బాబు, పంచాయతీరాజ్ డీఈఈ సాయిలు, ఏఈ అశోక్, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, కో ఆప్షన్ సభ్యుడు ఎం.డి.అబ్దుల్ అజీజ్, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


కాటారం జడ్పీహెచ్‌ఎస్‌లో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

## బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ కమిషనర్


మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15: భూపాలపల్లి మునిసిపల్ కమిష నర్ రాజేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయంలోని టీపీవో సునీల్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. మునిసిపాలిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని వార్డుల్లో పన్నుల బకాయిలను మార్చి 31లోగా వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ భవేశ్‌మిశ్రాను కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు


సేవాలాల్‌కు పూజలు నిర్వహిస్తున్న బంజారాలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 15: మండలకేంద్రంలోని వందన స్కూల్ మైదానంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో బంజారాలు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈవేడుకల్లో తహసీల్దార్ నెల్లుట్ల సృజన్‌కు మార్, డిప్యూటీ తహసీల్దార్ మమత, ఆర్‌ఐలు సుధాకర్, రాజేందర్, ఎంఈవో గొంది దివాకర్‌లు పాల్గొనగా బంజారాలు భోగ్ బండారోను నరసింహ నాయక్ సేవాలాల్ మహ రాజ్‌కు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సృజన్ కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహనాయక్ మాట్లాడుతూ బంజారాలు సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకాంత్, బంజారా పెద్దలు సక్రునాయక్, లావుడ్యా జోగానాయక్, రఘు, మున్నా, రఘురాం, సంసోత్ రాజన్న, శివరాం, హరిసింగ్, సమ్మయ్య, రాజు, మోహన్, వాగా, సుక్యా పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

కాటారం, ఫిబ్రవరి 15:కాటారం సర్కిల్ ఎక్సైజ్ సీఐగా టి.నరేందర్, ఎస్సైగా బి.కిష్టయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పార్లమెంట్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా కాటారం ఎక్సైజ్ సీఐగా పనిచేసిన ప్రశాంతిని ఖమ్మం జిల్లాలోని సింగరేణి ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ చేయగా మంచిర్యాల నుంచి నరేందర్, కిష్టయ్యను కాటారం ఎక్సైజ్ సీఐ, ఎస్సైలుగా బదిలీపై వచ్చారు. దీంతో మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో విధుల్లో చేరగా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

## కార్మికులకు సంస్థ స్థితిగతులను తెలియజేయాలి

కాకతీయఖని, ఫిబ్రవరి 15: సింగరేణి కార్మికులకు ఎప్పటికప్పుడు సంస్థ స్థితి గతులను తెలియజేయాలని భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్‌కు సూచించారు. ఏరియాలోని వర్క్‌షాపును ఆయన గురువారం పరిశీలించారు. కార్మికులకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలు, యంత్రాల పనితీరు, సంస్థ భవిష్యత్ ప్రణాళికలు తదితర అంశాలను తెలియపర్చేందుకు యాజమాన్యం మల్టీ డిపార్ట్ మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్యోతి, రామకృష్ణరెడ్డి, తుకారాం, శ్రీనివాస్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

కాకతీయఖని, ఫిబ్రవరి 15: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 333 క్వార్టర్లకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేయగా 467 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో అర్హత కలిగిన 248 మంది కార్మికులకు కేటాయించినట్లు వివరించారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ కవితా పోటీలకు విద్యార్థి ఎంపిక

చిట్యాల, ఫిబ్రవరి 15: రాష్ట్ర స్థాయి సైన్స్ కవితా పోటీలకు చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఓర్సు చిరంజీవి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి చిరంజీవి ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ఈమేరకు విద్యార్థి చిరంజీవిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌ఎన్ మండల కోఆర్డినేటర్ గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, సుధాకర్, బొమ్మ రాజమౌళి, రాంనారాయణ, సదయ్య, నీలిమ, సరళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో అందుబాటులోకి ఫైరింజన్

మేడారం, ఫిబ్రవరి 15 :మహాజాతర నేపథ్యంలో అగ్నిమాపక శకటాన్ని (ఫైరింజన్)ను సంబంధిత శాఖ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. జాతర సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెం టనే మంటలు ఆర్పేందుకు వాహనాన్ని గద్దెల పరిసరాల్లో ఉం చారు. ప్రస్తుతం నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, జాతర సమయంలో మరికొన్ని వాహనాలతోపాటు మొబైల్ ఫైర్ బైక్‌లను అందుబాటులోని తీసుకురానున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

**ఈగల బెడద**

వనదేవతల సన్నిధిలో ఈగలు బెడద ఎక్కువైంది. భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఇక్కడ పారిశుధ్యం లోపించింది. ప్రధానంగా గద్దెల పరిసరాల్లోనే పోగవుతున్న బెల్లంపై వాలుతున్న ఈగలు భక్తులను ఇబ్బంది పెడుతున్నాయి. గతంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించేవారని, ఇప్పుడు మాత్రం సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు.

**మద్యం అక్రమ అమ్మకాలు**

మేడారం మహాజాతరలో మద్యం అక్రమ విక్రయాలు జోరందుకున్నాయి. కొందరు ఇతర ప్రాంతాల, రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు జంపన్నవాగు ఒడ్డున పార్కింగ్ స్థలాల్లో అమ్మకాలు సాగిస్తున్నాన్నారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయిస్తున్నారు. సుమారు 150 డేరాలను ఏర్పాటు చేసి విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీకి రుసుములు చెల్లించకుండానే ఈ దందా చేస్తున్నారు. ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయిస్తూ భక్తుల జేబులు గుల్లా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఊరట్టం నుంచి జంపన్నవాగుకు వెళ్లే పార్కింగ్ స్థలంలో ఈ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఉచిత పార్కింగ్ వద్దకు వెళ్లిన వాహనాలకు రుసుము వసూలు చేస్తూ గుడారాల్లోనే ఉండాలని భయాందోళలకు గురిచేస్తున్నారని భక్తులు అంటున్నారు. దీంతో చేసేదేమీ లేక వాహన పార్కింగ్ రుసుము చెల్లించి వారి దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం!

కాటారం, ఫిబ్రవరి 15: మండలంలోని గారెపల్లి(కే) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన పలువురు డైరెక్టర్లు పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. గురువారం రాత్రి భూపాలపల్లి డీసీవో శైలజను ఈ మేరకు లేఖ అందించారు. తాము పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ స్వామిపై విశ్వాసం కోల్పోయామని, వారిపై అవిశ్వాసం పెట్టాలని కోరారు. లేఖ అందించిన వారిలో డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, రాజునాయక్, ఐలి రాజబాపు, మారపాక రాజేశ్వరి, జక్కుల ఐలయ్య, దండ్రు రాజయ్య, బాసాని హిమాకర్ ఉన్నారు. ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాసం నోటీసు అందించగా మరో ముగ్గురు వివిధ పనులపై వెళ్లినట్లు వారు తెలిపారు. ఆ ముగ్గురు సైతం అవిశ్వాసానికి మద్దతు తెలపనున్నట్లు వెల్లడించారు.

## నేడు రామభక్తుల శోభాయాత్ర

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: అయోధ్యలో ప్రతిష్ఠించిన బాలరాముడి దర్శనార్థం ములుగు జిల్లా నుంచి 200 మంది రామభక్తులు బయల్దేరనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ములుగులో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ములుగులోని డీఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతోందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం రామభక్తులు రైలులో అయోధ్యకు బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు.

## 'ఐటీడీఏ పీవో బదిలీని నిలిపివేయాలి'

ఏటూరునాగారం, ఫిబ్రవరి 15 : ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్ బదిలీని నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎట్టి ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ఐఏఎస్ అధికారిని పీవో నియమించారని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఆయన కృషి చేసి అనతికాలంలోనే గుర్తింపు పొందారని కొనియాడారు. అభివృద్ధికి పాటుపడుతున్న ఆయన్ను కొద్ది కాలంలోనే బదిలీ చేయడం సబబు కాదని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి


సమీర్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భూపాలపల్లి పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.కె.సమీర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన అతడిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 16న నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సమీర్ హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు.

## విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

మంగపేట, ఫిబ్రవరి 15: వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రవికుమార్‌హెచ్చరించారు. మంగపేట ఫారెస్ట్ రేంజి కార్యాలయంలో గురువారం నిర్వహించిన అటవీ శాఖ అధికారుల కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఎస్సై మాట్లాడారు. విద్యుత్ తీగలు అమర్చడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, పశువులు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో రేంజర్ షకీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి : డీఏవో

కాటారం, ఫిబ్రవరి 15: ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ సూచించారు. కాటారం రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. డీఏవో పలు అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. సాంకేతిక విషయాలపై అవగాహన పెంచుకుని రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వంటి ఇన్‌పుట్స్‌ను అందిం చాలన్నారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంఎస్‌వో సంజీవరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నారాయణ, ఏవో రామకృష్ణ, ఎంపీటీసీలు మహేశ్వరి, అజీజ్ పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడిగా కొమరయ్య

టేకుమట్ల, ఫిబ్రవరి 15: గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం భూపాలపల్లి నియోజకవర్గం అధ్యక్షుడిగా మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన మాదం కొమరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్‌లో ఆ సంఘం కార్యాలయంలో మాదం కొమరయ్యకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అధ్వర్యంలో నియమాకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారి భేరి రామచంద్ర యాదవ్, జిల్లా అధ్యక్షుడు గజ్జి రమేష్, వివిధ జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గంగారంలో వైభవంగా నాగులమ్మ జాతర

**పలు గ్రామాల్లో గద్దెలపైకి సమ్మక్క రాక**


నాగులమ్మ జాతరలో భక్తులు

కాటారం, ఫిబ్రవరి 15: మండలంలోని గంగారంలో నాగులమ్మ జాతర గురువారం వైభవంగా సాగింది. సమ్మక్క తల్లి బిడ్డ అయిన నాగులమ్మ పేరిట గంగారంలో గత కొన్నేళ్లుగా జాతర నిర్వహిస్తు న్నారు. సుమారు 30 ఏళ్లక్రితం నాగులమ్మ స్వయంభువుగా వెలిసిందని ప్రతీతి. నాగులమ్మ జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భావించే భక్తులు నాగులమ్మతోపాటు సమ్మక్క, సారక్క గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులకు ఓడిబియ్యం పోశారు. పలు గ్రామాల్లో కూడా సమ్మక్క, సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. మండలంలోని పలు చోట్ల సమ్మక్క ప్రతిరూపమైన కంక చెట్లను తెచ్చి గద్దెల వద్ద ప్రతిష్ఠించి కుంకుమ భరిణెలకు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లోనూ ప్రజలు సమ్మక్క, సారక్కకు యాటలు, కోళ్లను ఎదురుపిల్లగా ఇచ్చి మొక్కులు చెల్లించుకుని మేడారం మహా జాతరకు వెళ్లడానికి సిద్ధం అవుతున్నారు.

## విలాసాగర్‌లో ఇసుక డంపుల సీజ్

కాటారం, ఫిబ్రవరి 15: మండలంలోని విలాసాగర్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గురువారం మైనింగ్ అధికారి మధుసూదన్, ఆర్‌ఐ వెంకన్న గురువారం పరిశీలించి సీజ్ చేశారు. మానేరు నది నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్లతో తెచ్చి అక్రమంగా నిల్వ చేశారని వచ్చిన సమాచారం మేరకు అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించగా పెద్ద ఎత్తున ఇసుక డంపులు కాన రావడంతో వాటిని సీజ్ చేశారు. ఇటీవల కొందరు ఇసుకను జేసీబీతో లారీల్లో లోడ్ చేసి హైద్రాబాద్‌కు తరలించినట్లు ఆరోపణలున్నాయి. 10 ఇసుక డంపులు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వాటిని త్వరలో బహిరంగ వేలం వేయడం జరుగుతుందని వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు.

## కాళేశ్వరం ఎస్‌ఐగా భవానీసేన్



మహదేవపూర్, ఫిబ్రవరి 15: కాళేశ్వరం ఎస్సైగా భవానీసేన్‌ను నియమించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్సై లక్ష్మణరావు పెద్దపల్లికి బదిలీ అయ్యారు. దీంతో మహదేవపూర్ -2 ఎస్సైగా పనిచేస్తున్న భవానీసేన్‌ను ఎస్సైగా నియమించారు.

# 'సారు తీరు'పై సర్వత్రా చర్చ

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 15 : మేడిగడ్డ బ్యారేజీలో పనిచేస్తున్న ఓ అధికారి నిర్వాకంపై విస్మయం వ్యక్తమవుతోంది. 'మారని సారు తీరు..' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇది సంబంధిత శాఖలో కలకలం రేపింది.

సస్పెన్షన్ గురైన అధికారిని విధుల్లోకి ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందనే కోణంలో విచారణకు దారి తీసిందని తెలిసింది. గత నెలలో జరిపిన విజిలెన్స్ అధికారుల తనిఖీల్లోనూ ఆ అధికారి తీరుపై ఆరా తీసినట్లు సమాచారం. తన వైఖరి కార్యాలయంలో ఉద్యోగులందరికీ తెలిసినా ఎవరూ నోరుమెదపకుండా ఆయన జాగ్రత్తలు పడేవారని మరో అధికారి చెప్పారు. 'మీరు చేస్తున్నది సరికాదు' అని ఎవరైనా అంటే.. ఆ ఉద్యోగిపై కక్షగట్టే వారని, ఇంక్రిమెంట్లు ఆపేవారని చర్చించుకుంటున్నారు.. ప్రొబేషన్‌లో ఉన్న వారికి క్లియరెన్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టెవారని చెబుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి లింక్-1కు బాధ్యత వ్యవహరించిన పెద్ద సారుకంటే ఈసారే ఎక్కువగా ఇబ్బంది పెట్టేవారని ఆ శాఖలో పనిచేసే మరో అధికారి చెప్పారు. అదే బ్యారేజీలో తన సహచర ఉద్యోగిగా పనిచేసిన ఇంజనీరును ఆయన ఓ సందర్భంగా దూషించినట్లు సమాచారం. అయితే.. కేవలం ఆ సారు మీద భయంతోనే బయటకు చెప్పేవారు కాదని అంటున్నారు. విషయం బయటపెడితే మళ్లీ ఏం అంటగడుతాడో..? అని భయపడేవారని తెలిసింది. తాము ఏ తప్పు చేయకపోయినా పలువురికి షోకాజ్ నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేసేవారని సమాచారం. బ్యారేజీ పనుల్లోనే కాకుండా తన కింద పనిచేసే సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసే వారని తెలిసింది.

## రేవంత్‌రెడ్డిని కలిసిన గాజర్ల అశోక్


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న గాజర్ల అశోక్, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 15: సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధికార ప్రతినిధి, భూపా లపల్లి ప్రాంత నాయకుడు గాజర్ల అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదారాబాద్‌లో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కూడా ఉన్నారు.

## ఆటో బోల్తా పడి గాయాలు

మేడారం, ఫిబ్రవరి 15: భక్తుల ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన సంఘటన తాడ్వాయి మండలం చింతల్ క్రాస్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మేడారం వనదేవతల దర్శనానికి సూర్యపేటకు చెందిన వనదేవతల భక్తులు ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఆటోలో బయల్దేరి వచ్చారు. చింతల్ క్రాస్ మలుపు వద్ద వేగంగా వచ్చి బోల్తా పడింది. స్వల్ప గాయాలు తప్ప ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. గాయపడిన వారు అదే ఆటోలో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలి వెల్లారని తెలిపారు

## వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

**డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి**

కాటారం, ఫిబ్రవరి 15: వన్యప్రాణులను వేటాడితే చట్టరీత్యా కఠిన తప్పవని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. విద్యుత్ ఉచ్చులు పెట్టే మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి పోలీస్‌స్టేషన్‌లో పోలీసు, అటవీ శాఖల ఆధ్వర్యంలో గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో తెలిసో, తెలియకో విద్యుత్ ఉచ్చులు పెట్టారని, ఇది పునరావృతమైతే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. అటవీ, పోలీసు చట్టాల ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం 15 మందిని తహసీల్దార్ నాగరాజు ఎదుట రూ. లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఎఫ్‌ఎస్‌వోలు అంజయ్య, చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి బంద్‌ను విజయవంతం చేయండి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: శుక్రవారం జరిగే దేశవ్యాప్త గ్రామీణబంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రసాద్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి కోరారు. ములుగులో గుండెబోయిన చంద్రయ్య అధ్యక్షతన గురవాఆరం జరిగిన అఖిలపక్ష రైతుసమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త గ్రామీణబంద్‌లో రైతులు, కార్మికులు, కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. దేశంలో రైతు ఉద్యమంలో కేంద్ర ప్రభుత్వం పెట్టిన కేసులను ఉపసంహరించాలని, వ్యవసాయ కార్మికులకు పని కల్పించాలని, దినసరి కూలీలకు రూ.700 ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు పల్లెబోయిన స్వామి, బానోత్ నరసింహ, కొర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ మస్టర్లకు తెగబడుతున్న గుర్తింపు సంఘం నేతలు : ఐఎన్‌టీయూసీ

కాకతీయఖని, ఫిబ్రవరి 15: సింగరేణి గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు కొందరు ఫ్రీ మస్టర్లకు తెగబడుతున్నారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి ఏరియాలకల్లా భూపాలపల్లి వెనుకబడి ఉందని పేర్కొన్నారు. కొందరు ఏఐటీయూసీ నాయకులు మస్టర్ వేసి విధుల్లో పాల్గొనకుండానే బయటకు వెళ్లి వ్యక్తిగత పనులు చూసుకుంటున్నారని ఆరోపించారు. వీరిని చూసి మరికొందరు కార్మికులు కూడా అదే బాటపడుతున్నారని తెలిపారు. దీంతో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సింగరేణి అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గనుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఇలాంటి వారిని విజిలెన్స్ అధికారులు పసిగట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధికి ముందుండి పనిచేయాల్సిన నాయకులు ఇలాంటి తప్పులు చేయడం సరికాదని హితువు పలికారు.

## ములుగు జిల్లాకు 23 ఇన్‌స్పైర్ అవార్డులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ములుగు జిల్లాకు 23 ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు మంజూర య్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపథకానికి ఎంపికైన విద్యార్థులు గైడ్ టీచర్ల సూచనలు, సలహాలతో ప్రతిపాదించిన నమూనాలు, ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీల్లో ఎంపికయ్యేలా సృజనాత్మకతను ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతిఏటా దేశంలోని ఆరు నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఇన్‌స్పైర్ మానక్ పేరిట అవార్డులను అందిస్తు న్నాయని తెలపారు. ఈపథకానికి ఎంపికైన విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు లతో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

## ఆదివాసీ నేతల అరెస్టు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 15: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఆదివాసీ సంఘాల నేతలను పస్రా పోలీసులు గురువారం ముం దస్తు అరెస్టు చేశారు. ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్ర మాన్ని అడ్డుకుంటా మని ఆదివాసీ సంఘాల నేతలు ప్రకటించిన నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. ఈసందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు ముద్దబో యిన రవి, వట్టం సురేష్, ఈక జగ్గారావు, చర్ప లక్ష్మీనారాయణ, గొంది రాజేష్ మాట్లాడుతూ మేడారం ఉత్సవ కమిటీ గిరిజనే తరులను నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

## రామప్పను సందర్శించిన ఆస్ట్రేలియా దేశస్థులు


శిల్పకళా సౌందర్యాన్ని కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 15: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని గురువారం ఆస్ట్రేలియా దేశానికి చెందిన మార్టిన్, టోనీలు సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఆలయ తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరియాలు కొట్టారు. అనంతరం దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి తమ కెమెరాలో బంధించుకున్నారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు.